

వైభవంగా సుదర్శన హోమం

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం యాదాద్రి ఆలయంలో సుదర్శనహోమం వైభవంగా నిర్వహించారు. - 10లో



తరుగు తీశారని ఆందోళన

ఇష్టారీతిన ధాన్యంలో తరుగు తీసి కొనుగోలు చేశారని గురువారం పెద్దవూరలో రైతులు ఆందోళన చేశారు. - 10లో

గరిష్టం/కనిష్టం
36° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు

నల్లగొండ టౌన్ : ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు అన్నారు. గురువారం నల్లగొండలోని చర్చి కంపౌండ్‌లో సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి మిషన్ వారి సహకారంతో గ్రేస్ కాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండల్‌రావు మాట్లాడుతూ పట్టణ ప్రజల కోసం ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్.కిష్టోఫర్, సతీష్‌చందర్‌దాస్, ఎస్.ఆనందప్రసాద్, అబ్షాలోమ్, కె.మత్స్యగిరి, ఎలిషా, జయప్రకాష్, ప్రదీప్, ప్రభుచరణ్, జేమ్స్ పాల్గొన్నారు.

మరో పోరాటం తప్పదు

నల్లగొండ టూటౌన్: ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.రమ, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన వీఓఏల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. వేతనాలు పెంపు, ఐడీ కార్డులు, రూ.10 లక్షల ప్రమాద బీమా, 58 జీఓ సవరణ తదిర సమస్యలు పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారని తెలిపారు. వీఓఏల పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఊరుకోబోమన్నారు. అనంతరం సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చిలుముల దుర్గయ్య, కోశాధికారి ఎస్‌కె.సైదాబేగం, ఉపాధ్యక్షులు ఎం. జంగయ్య, సులోచన, ఎం.మంగమ్మ, జి.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.


నిరుపేదలందరికీ 'గృహలక్ష్మి' అమలు చేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్: జిల్లాలోని ఇల్లులేని నిరుపేదలందరికీ ఇంటిస్థలం ఇవ్వడంతోపాటు గృహలక్ష్మి పథకం అమలు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, తీగల సాగర్ డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. నిరుపేదలందరికీ గృహలక్ష్మి వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ జూలై 3న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం భూమలను సర్వే చేసి గుర్తించి వాటిని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, సీహెచ్ లక్ష్మీనారాయణ, నారి ఐలయ్య, బొజ్జ చినవెంకులు, కె.నాగిరెడ్డి, వీరవల్లి వెంకటేశ్వర్లు, పాలడుగు ప్రభావతి, నాగార్జున్, వరలక్ష్మి, బండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. స్వామివారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు గావించారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, సాయంత్రం జోడు సేవ, రాత్రి శయనోత్సవం నిర్వహించారు.

తొలకరి పలకరింత

నైరుతి రుతుపవనాల ఆగమనం

- 27 మండలాల్లో కురిసిన వర్షం
- ఆనందంలో జిల్లా రైతాంగం
- వానాకాలం సాగుకు సమాయత్తం



కట్టంగూర్‌లో కురుస్తున్న వర్షం

నల్లగొండ అగ్రికల్చర్: తొలకరి వర్షం పలకరించింది. రెండు నెలలుగా ఎండల తాకిడికి అల్లాడిన జనం రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు పులకరించిపోయారు. ఒక్కసారిగా వాతావరణ చల్లబడడంతో ఇక ఎండల తీవ్రత తగ్గినట్టేనని ఊపిరి పీల్చుకుంటున్నారు. నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి ప్రవేశించి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొన్నప్పటికీ ముఖం చాటేశాయి. దీంతో వర్షాలు లేకపోవడంతో సీజన్ ఆరంభమై మూడు వారాలు దాటినప్పటికీ వానాకాలం సాగుకు రైతులు కాస్త వెనుకడుగు వేశారు.

సిద్ధంగా దుక్కులు

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పత్తి విత్తనాలను విత్తుకోవడానికి రైతులు దుక్కులను దున్నుకుని సిద్ధంగా ఉంచుకున్నారు. నాన్ ఆయకట్టు ప్రాంతంలో వరినార్లు పోసుకుని వర్షాలు కురిస్తే పొలాలు దున్నుకుని నాట్లు వేసుకోవడం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో అన్న దాతలలో ఆశలు చిగురించాయి. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారం వర్షాలు కురుస్తామని వాతావరణ శాఖ పేర్కొనడంతో రైతులు రెట్టింపు ఉత్సాహంతో వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. మరికొన్ని చోట్ల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లాఅంతటా మేఘాలు కమ్ముకుని వర్షాలు కురుస్తున్నాయి. అదునైన వర్షం కురిస్తే జిల్లా అంతటా పత్తి విత్తనాలు పెద్ద ఎత్తున విత్తుకునే అవకాశం ఉంది.

11.93లక్షల ఎకరాల్లో సాగు అంచనా

ప్రస్తుత వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 11.93లక్షల ఎకరాలలో వరి, పత్తి , ఇతర పంటలను సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. అందులో వరి 5.25లక్షల ఎకరాలు, పత్తి 6.50లక్షల ఎకరాలు, కంది 10 వేలు, వేరుశనగ 3వేలు, పెసర ఇతర పంటలు మరో ఐదు ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

సగటు వర్షపాతం 7.3 మి.మీ.

'నైరుతి' కారణంగా గురువారం జిల్లాలో 27 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా మర్రిగూడ మండలంలో 24.4 మిల్లీ మీటర్లు, శాలిగౌరారం మండలంలో 24.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా కట్టంగూర్ మండలంలో కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం7.3 మిల్లీమీటర్లుగా నమోదైంది.



వివిధ మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలు ఇలా..

మండలం	మిల్లీమీటర్లు				
నార్కట్‌పల్లి	2.2	నాంపల్లి	1.6	పెద్దవూర	5.8
కట్టంగూర్	0.5	గుర్రంపోడు	0.7	పీఏపల్లి	10.6
నకిరేకల్	2.8	హాలియా	19.2	నేరెడుగొమ్ము	11.4
కేతేపల్లి	4.2	నిడమనూరు	14.2	కొండమల్లేపల్లి	15.6
తిప్పర్తి	8.8	త్రిపురారం	7.1	దేవరకొండ	10.9
నల్లగొండ	2.7	మాడుగులపల్లి	9.5	గుండ్లపల్లి	11.9
చండూరు	2.4	వేములపల్లి	7.3	చందంపేట	22.4
చింతపల్లి	5.1	మిర్యాలగూడ	0.9	గట్టుప్పల్	3.3
		అడవిదేవులపల్లి	5.2	మర్రిగూడ	24.4

అమరుల త్యాగాలతోనే తెలంగాణ



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, డీఏఓ సుచరిత తదితరులు

- జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి
- నల్లగొండలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

నల్లగొండ: అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చివరిరోజు నల్లగొండలోని గడియారం సెంటర్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, అమరుల కుటుంబ సభ్యులతో కలిసి జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లోని అమరవీరుల స్థూపం తోపాటు శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి గడియారం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అమరులకు సంతాపం తెలుపుతూ ప్రత్యేక తీర్మానం చేశారు. రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న తెలంగాణ నేడు అభివృద్ధిపథంలో దూసుకుపోతోందన్నారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అమరుల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించి, సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం జిల్లాలో అమరులైన 26 మంది కుటుంబాల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించామని, రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేశామన్నారు. చివరగా అమరుల కుటుంబాలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: 108, 102 అమ్మఒడి అంబులెన్సుల్లో డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 35 సంవత్సరాల వయస్సు లోపున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు పూర్తి వివరాలకు సెల్ : 9948538540, 8008935533 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా



నల్లగొండలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడానికి తీసుకెళ్తుండగా అడ్డుకుంటున్న పోలీసులు

నల్లగొండ: దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం దగా చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలు కాదు.. దశాబ్ది దగా పేరుతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పది తలల రావణాసురుడిగా సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని తయారు చేసి అందులో అమలుకాని పథకాల పేర్లు రాసి ఎంపీ కోమటిరెడ్డి ఇంటి నుంచి ఎన్జీ కళాశాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్జీ కళాశాల వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం రామగిరి సెంటర్లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గుమ్మల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గడియారం సెంటర్‌లో వైస్ ఎంపీపీ జిల్లేపల్లి పరమేష్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేయగా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కనగల్ తిప్పర్తి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనూప్‌రెడ్డి, జూకూరి రమేష్, కౌన్సిలర్లు ఇంతియాజ్, జూలకంటి ధనలక్ష్మి, కరుణాకర్‌రెడ్డి, కలీం, నాయకులు కత్తుల కోటి, అఫ్జల్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, జూలకంటి సైదిరెడ్డి, నరేష్‌రెడ్డి, బాలకృష్ణ, రమేష్ యాదవ్, కార్తీక్, నాగరాజు, సతీష్,రాజు, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

సీఎల్పీ నేత 'భట్టి'కి నాయకుల పరామర్శ



పాదయాత్ర శిబిరం వద్ద భట్టి విక్రమార్కను పరామర్శిస్తున్న హనుమంతరావు

కేతేపల్లి: అస్వస్థతకు గురై కేతేపల్లి పాదయాత్ర శిబిరం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను గురువారం రాత్రి ములుగు ఎమ్మెల్యే సీతక్క, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్ అస్మతుల్లా, ఓయూ జేఏసీ అధ్యక్షుడు లోకేష్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా భట్టి ఆరోగ్య పరిస్థితిపై వారు ఆరా తీశారు. రాష్ట్ర, రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలపై వారు చర్చించినట్టు తెలిసింది.

బీఆర్ఎస్ ప్రభుత్వానిది నిరంకుశ పాలన



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు

మిర్యాలగూడ: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల దగా పేరుతో గురువారం మిర్యాలగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానికంగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి రాజీవ్‌చౌక్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మాట్లాడుతూ అమరుల త్యాగాన్ని గుర్తించి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే మాయమాటలతో ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, ఐఎన్‌టీయూసీ, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్‌కు ససేమిరా!

- దేవరకొండలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటుకు అధికారుల ప్రయత్నాలు
- ప్రభుత్వ కళాశాల స్థలంలో వద్దంటున్న విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు
- ఇటీవల పనుల అడ్డగింత.. ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు వినతి



మార్కెట్ నిర్మాణ స్థలంలో చేసిన మార్కింగ్

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించనున్న వెజ్, నాన్ వెజ్(సమీకృత) మార్కెట్ ఏర్పాటును విద్యార్థి, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అధికారులు మాత్రం మార్కెట్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు. ఓ వైపు ప్రజా సంఘాలు ఏర్పాటు చేయొదంటుంటే.., మరో వైపు అధికారులు సమీకృత మార్కెట్ పనులకు పూనుకుంటున్నారు.

రూ.4.50 కోట్ల నిధులతో..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు ఇప్పటికే సంబంధిత పబ్లిక్ అండ్ హెల్త్, మున్సిపల్ అధికారులు ముందడుగు వేశారు. కళాశాల ఆవరణలోని ఎకరం 34గుంటల స్థలంలో రూ.4.50కోట్లతో చేపట్టనున్న మార్కెట్ నిర్మాణంలో భాగంగా 56 వెజ్, 22 నాన్‌వెజ్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు.

వ్యతిరేకిస్తున్న విద్యార్థి, ప్రజా సంఘాలు

కలెక్టర్ ఆదేశాలతో స్థానిక అధికారులు మార్కెట్ ఏర్పాటు పనులు మొదలు పెట్టారు. అయితే పనులు మొదలు పెట్టినప్పటి నుంచి వివిధ విద్యార్థి, ప్రజా సంఘాలతో పాటు బీజేపీ, బీఎస్పీ నాయకులు మార్కెట్ ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తున్నారు. దీంట్లో భాగంగా ఇటీవల ఆయా పార్టీలు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పనులను అడ్డుకున్నారు. కళాశాల స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఇటీవల మార్క్ ఔట్ పనులు చేపట్టేందుకు కళాశాలకు వచ్చిన పబ్లిక్ అండ్ హెల్త్ డీఈ మనోహర, ఏఈ రాజులను బీజేపీ, ఏబీవీపీ నాయకులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. ఇదిలా ఉంటే విద్యార్థి సంఘాలు, ఆయా పార్టీల నేతలు ఎట్టి పరిస్థితుల్లోనూ కళాశాల ఆవరణలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయయొద్దంటూ డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ ఏర్పాటు చేపట్టొద్దంటూ గత మూడు రోజులుగా కళాశాల ఎదుట ఏబీవీపీ నాయకులు నిరాహార దీక్ష చేస్తున్నారు. సమీకృత మార్కెట్‌ను మరో చోట ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెట్ నిర్మాణ పనులను కొనసాగించనున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

నిర్ణయాన్ని విరమించుకోవాలి



ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రాంగణంలో మార్కెట్ ఏర్పాటు నిర్ణయం సరైంది కాదు. మార్కెట్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు, కళాశాల నిర్వాహణకు ఇబ్బందికరంగా ఉంటుంది.

– అంకూరి నర్సింహ, బీజేపీ నాయకుడు

మార్కెట్ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదు



ఇప్పటికే సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయొద్దంటూ విద్యార్థి, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరిస్తే మంచిది. మార్కెట్ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదు. విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి మార్కెట్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాం.

– ఎర్ర కృష్ణ, బీఎస్పీ నాయకుడు


మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలేవీ?

- సకాలంలో అందించని పంచాయతీ పాలకవర్గాలు
- మూడు నుంచి పది నెలలుగా పెండింగ్
- సమ్మె నోటీస్ ఇచ్చినా స్పందించని యంత్రాంగం
- ఇబ్బందుల్లో పంచాయతీ కార్మికులు



అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ వర్కర్లు (ఫైల్)

అప్పులపాలయ్యాం..



"12 నెలల నుంచి వేతనాలు లేవు. కుటుంబం గడవడానికి తెలిసిన వారి వద్ద అప్పులు చేశాం. పిల్లల చదువులకు ఇబ్బందులు పడుతున్నాం. సంవత్సరం నుంచి వేతనాలు లేకుంటే మేము ఎలా బతికేది. ఇప్పటికైనా మాకు వేతనాలు ఇప్పించాలి.

– నీల అంజయ్య, తేనేపల్లి, గుర్రంపోడు మండలం

నల్లగొండ: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు నెలనెలా వేతనాలు అందడం లేదు. కార్మికులకు వేతనాలు ఇచ్చిన తర్వాతనే మిగతా పనులకు ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించినప్పటికీ గ్రామ పంచాయతీ పాలక వర్గాలు అవేమి పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రతినెలా కార్మికుల వేతనాలకు విడుదల చేస్తున్న నిధులను ఇతర పనులకు ఖర్చు చేస్తుండటంతో కార్మికులు నెలల తరబడి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 2,700 కార్మికులు

జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో దాదాపు 2,700 మంది మల్టీపర్పస్ వర్కర్లు పని చేస్తున్నారు. గతంలో తక్కువ వేతనాలు ఉండగా తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీ చట్టం తీసుకొచ్చిన సందర్భంలో రూ.8,500లకు వేతనాలు పెంచింది. అయితే పంచాయతీల అభివృద్ధి కోసం ప్రతినెల ఆయా జనాభాను బట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులను విడుదల చేస్తున్నాయి. అందులో ప్రధానంగా మొదట గ్రామపంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు, ఆతర్వాత విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు చెల్లించిన తర్వాత మిగిలిన డబ్బులను ఇతర పనులకు వాడుకోవచ్చని నిబంధన ఉంది. కానీ వాటిని పట్టించుకోకుండా వచ్చిన డబ్బులను ఇతర పనులకు ఖర్చు చేస్తుండటంతో వేతనాల చెల్లింపులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సమ్మెకు వెళ్తామని నోటీసులిచ్చినా..

ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోనూ వేతనాలు కూడా సరిగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మల్టీపర్పస్ వర్కర్లు వాపోతున్నారు. తమ సమస్యల పరిష్కారానికి సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయమై ఇటీవల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావును కలిసి వేతనాలు ఇవ్వాలని కోరడంతోపాటు సమ్మె నోటీస్ కూడా అందజేశారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు గురువారం భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలి పిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలో జగదేవ్‌పూర్ వెళ్లే రోడ్డు మార్గంలోని బ్రిడ్జి వద్ద కాజీపేట–సికింద్రాబాద్ రైలు మార్గంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రైలు నుంచి పడి మృతి

భువనగిరి: ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామం వద్ద గురువారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పగిడిపల్లి గ్రామం వద్ద గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతిచెందినట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన రతన్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 22 నుంచి 25 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


మౌనిక

మిర్యాలగూడ అర్బన్: కుటుంబ సభ్యులతో కలిసి పని నిమిత్తం మిర్యాలగూడ పట్టణానికి వచ్చిన మహిళ అదృశ్యమైనట్లు గురువారం ఫిర్యాదు అందిందని మిర్యాలగూడ టూటౌన్ ఎస్ఐ ఎస్. క్రిష్ణయ్య పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని కొర్రైతండాకు చెందిన కేతావత్ మౌనిక బుధవారం పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి మిర్యాలగూడ పట్టణానికి వచ్చింది. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మిర్యాలగూడ రైతు బజారు వద్ద తన బాబాయికి ఆధార్‌కార్డు ఇచ్చి వస్తానని చెప్పి వెళ్లిన మౌనిక తిరిగి రాలేదు. ఆమె ఎంతకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మౌనిక ఆచూకీ తెలిసిన వారు 8186865497 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

శ్రీ కృష్ణ మ్యాక్స్ క్రెడిట్ కో-ఆపరేటీవ్ సొసైటి లిమిటెడ్ ఎఫ్.పి. బ్యాంక్
మా యొక్క సంస్థ నందు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మండలాల వారీగా మా యొక్క బ్రాంచెస్ నందు పనిచేయుటకు బ్యాంకింగ్, చిట్‌ఫండ్ నందు కనీసం 2 సంవత్సరాల పైన అనుభవం గలవారు మార్కెటింగ్ ఆఫీసర్ లుగా కావలెను.
Salary: ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్ + అలవెన్స్
Age: 24 Above, Qualification: Any Degree
బ్రాంచెస్: 1. నార్కట్‌పల్లి, 2. నల్గొండ, 3. నకిరేకల్
Contact: 7815955438, 9959246443
Address: Opposite Police Station, Main Road, Narketpally - 508114

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
Flat for sale @Nalgonda Town Ready to Occupy 2&3 bhk as per Vasthu good Ventilation, Carparking. Ph: 9030195000, 9030009059 [H-778999]

Wanted
త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఉచిత వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 3K ఫోన్: 9848571888 [H-793449]
Job Vacancy: Age:18 to 30, 10th to Any Degree, Office Job 18000 to 25000/- work from home 15000 to 18000/- ✆ 9346416039. [T-774182]
కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కోదాడ నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన బస్ డ్రైవర్స్, సెక్యూరిటీ గార్డ్స్, లేడీ హాస్టల్ వార్డెన్స్, GNM (B.Sc నర్సింగ్) కావలెను. సం॥ 9666633376 [Y-784368]

Services

LOST
దండు రేణుక D/o వెంకటయ్య R/o 18-821/1, మిర్యాలగూడకు చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ నెం. 4247/2020, 2670 /2009, 2891/2008 గలవి మిర్యాలగూడ నుండి తాళ్లగడ్డకు ఆటోలో వస్తుండగా పోయినవి. దొరికినవారు సంప్ర॥ 8125694494 [YA-2691]

ప్రకటన కోరండి! వ్యాపారం పెంచండి!! సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ.:220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010422240, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచు రించే క్లాసిఫైడ్ ప్రకటనల చదివి, వాటిని నిశితంగా పరిశీలించి చిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కవలలు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ధర్నా

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం నవజాత కవలలు మృతిచెందారు. కాగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువులు మృతిచెందారని ఆరోపిస్తూ బంధువులు మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామానికి చెందిన సతీష్ తన భార్య నవ్యను ఈ నెల 20న కాన్పు కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. నవ్యను పరీక్షించిన వైద్యులు అంతా బాగానే ఉందని నార్మల్ డెలివరీ అవుతుందని చెప్పారు. కాగా గురువారం నవ్యకు పురిటినొప్పులు రావడంతో డాక్టర్లు ఆపరేషన్ చేసి కవలలను బయటకు తీయగా అప్పటికే వారు మృతిచెందారు. కాగా వైద్యులు సకాలంలో ఆపరేషన్ చేసి ఉంటే తమ పిల్లలు బతికేవారని సతీష్ ఆవేదన వ్యక్తం చేశాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ పిల్లలను చనిపోయారని, డాక్టర్లపై వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ లచ్చు మాట్లాడుతూ.. తల్లి గర్భంలో ఉండగానే కవలలు చనిపోయి ఉన్నారని, దీంతో వెంటనే ఆపరేషన్ చేసి బయటకు తీయాల్సి వచ్చిందన్నారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదని పేర్కొన్నారు.


మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

చనిపోయిన వ్యక్తికి వైద్యం చేశారని..

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

నల్లగొండ టౌన్: చనిపోయిన వ్యక్తికి వైద్యం చేసి డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తూ గురువారం నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీప గ్రామానికి చెందిన నరేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కానీ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లకుండా రాత్రి సమయంలో నల్లగొండ పట్టణంలోని ఐకాన్ ప్రైవేట్ ఆస్పత్రికి నరేష్‌ను తీసుకెళ్లగా గురువారం మృతిచెందాడు. అయితే నరేష్ చనిపోయినప్పటికీ చెప్పకుండా ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యం చేసినట్లు చేసి డబ్బులు వసూలు చేశారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఐకాన్ ఆస్పత్రి డాక్టర్లపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. దీనిపై ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ.. తల, ఛాతిపై తీవ్రగాయాలతో ఉన్న నరేష్‌ను బుధవారం రాత్రి ఆస్పత్రికి తీసుకొచ్చారని, అతడిని పరీక్షించి 99శాతం బతికే అవకాశం లేదని లేదని చెప్పినప్పటికి వైద్యం చేయాలని కుటుంబ సభ్యులు కోరారన్నారు. గురువారం మళ్లీ నరేష్ బంధువులను పిలిచి నమ్మకం లేదని చెప్పామని, దీంతో వారు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే అతడు చనిపోయాడని తెలిపారు. చనిపోయిన వ్యక్తికి ట్రీట్‌మెంట్ చేశామనడంలో వాస్తవం లేదన్నారు. ఆస్పత్రిలో వారు రూపాయి కూడా చెల్లించలేదని, మందులు మాత్రం కొన్నారని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- 30తులాల బంగారు ఆభరణాలు, 14తులాల వెండి చోరీ


బీరువాను పరిశీలిస్తున్న ఏసీపీ కోట్ల నర్సింహారెడ్డి, సీఐ సైదయ్య

యాదగిరిగుట్ట: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, వెండి అపహరించిన ఘటన యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్న చెరుకుపల్లి కొండల్ రెండు రోజుల క్రితం తన కుమార్తె డెలివరీ కోసమని ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి కొండల్, అతడి కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటం గమనించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉండటంతో పాటు అందులో ఉన్న సుమారు 30తులాల బంగారు ఆభరణాలు, 14 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. విషయం తెలుసుకున్న ఏసీపీ కోట్ల నర్సింహారెడ్డి, సీఐ సైదయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంని రప్పించి వేలిముద్రలు సేకరించారు. బాధితుడు కొండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు అపహరణ

చౌటుప్పల్: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని దొంగ లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన కట్ట రాములమ్మ(60), ఆమె బంధువు వెంకటమ్మ కలిసి చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లేందుకు వస్తూ స్థానిక బస్‌స్టేషన్‌లో బస్సు దిగారు. తాళ్లసింగారం గ్రామానికి నేరుగా ఎలాంటి వాహనాలు అందుబాటులో ఉండనందున చౌటుప్పల్ పట్టణంలోని భాస్కర్ థియేటర్ నుంచి రాంనగర్‌కాలనీ మీదుగా ఇద్దరు కలిసి నడుచుకుంటూ వెళ్తున్నారు. అప్పటికే నల్లరంగు టీషర్ట్ ధరించిన యువకుడు వీరిని అనుసరిస్తున్నాడు. ఈ విషయాన్ని వారు గుర్తించలేదు. కాగా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమీపంలోకి వెళ్లగానే రాములమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును యువకుడు లాక్కొని పారిపోయాడు. రాములమ్మ కేకలు వేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో దొంగ కోసం పరిసర ప్రాంతాల్లో తీవ్రంగా గాలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో చోరీ

- ఉత్సవ విగ్రహాల మెడలోని బంగారు పుస్తెలతాడు అపహరణ

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో గల చెన్నకేశవస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి నర్సింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం గ్రామానికి చెందిన కారింగు బాలయ్య ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లగా దేవాలయం ఉత్తర వైపు ఉన్న గేట్ తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూడగా గర్భగుడి తలుపు బేడం విరిగి, తాళం కిందపడి ఉంది. దీంతో వెంటనే అతడు ఆలయ పూజారి నర్సింహమూర్తికి విషయం తెలియజేశాడు. పూజారి ఆలయానికి చేరుకొని గర్భగుడిలోనికి వెళ్లి చూడగా శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాల మెడలో ఉన్న సుమారు 7గ్రాముల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైందని గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. అయితే మూలవిరాట్ దేవుళ్ల మెడలో ఉన్న మరో రెండు తులాల పుస్తెలతాడు పూలమాలలు, శాలువా మాటున ఉండటంతో దుండగులు దానిని గమనించకపోవడంతో చోరీకి గురికాలేదని పూజారి పేర్కొన్నారు. కాగా నాలుగు నెలల క్రితం గుర్తుతెలియని దుండగులు ఇదే దేవాలయంలో హుండీలోని నగదును ఎత్తుకెళ్లారని తెలిసింది.


గర్భగుడి గడపపై పడి ఉన్న తాళం

కుర్మేడ్ దేవాలయంలో..

చింతపల్లి: మండల పరిధిలోని కుర్మేడు గ్రామంలో గల శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దేవాలయంలోని హుండీ తాళాలు పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన ఆకారం ప్రశాంత్(21) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి చౌటుప్పల్ నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. చౌటుప్పల్ పట్టణంలోని బాలాజీ రామకృష్ణ దేవాలయం వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీకాంత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. వన్ టౌన సీఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని కట్టవారిగూడెం గ్రామానికి చెందిన బొబ్బిలి నరేష్(27) ఈ నెల 20న బైక్‌పై కనగల్ మండలంలోని దర్వేశిపురంలో శుభకార్యానికి హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్డులోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ పైనుంచి అదుపుతప్పి కిందపడడంతో నరేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెనకే మరో బైక్‌పై వస్తున్న నరేష్ స్నేహితులు శివ, రాజు గమనించి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు వీరస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు.

బైక్‌ని ఢీకొట్టిన లారీ.. భర్త మృతి

- భార్య, కుమారుడికి గాయాలు


అశోక్ (ఫైల్)

హాలియా: తమ కుమారుడితో కలిసి వెళ్తున్న బైక్‌పై భార్యాభర్తలను ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టడంతో ఘటనలో భర్త అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వర్ నగర్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన అటికం అశోక్(22) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య ధనలక్ష్మి, ఏడాది వయస్సున్న కుమారుడు ఉన్నారు. ధనలక్ష్మి గర్భవతి కావడంతో ఆస్పత్రిలో చూపించడానికి ముగ్గురూ కలిసి గురువారం బైక్‌పై నల్లగొండకు బయల్దేరారు. ఆస్పత్రిలో చూపించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వర్‌నగర్ సమీపంలోకి రాగానే వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతిచెందగా, ధనలక్ష్మికి తీవ్ర గాయాలు, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చికిత్స నిమిత్తం ధనలక్ష్మి, కుమారుడిని నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

భువనగిరిలో దొంగల బీభత్సం

- మూడు షాపుల్లో చొరబడి సుమారు రూ.3లక్షల నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లు చోరీ

భువనగిరి: పట్టణంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పలు షాపుల తాళాలు పగులగొట్టి నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లు అపహరించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి భువనగిరి పట్టణంలోని హైదరాబాద్–వరంగల్ ప్రధాన రహదారి పక్కన గల ప్రిన్స్ మెడికల్ ఏజెన్సీ, ప్రిన్స్ మెడికల్ షాప్, గ్రీన్ బకెట్ బిర్యానీ సెంటర్ షట్టర్లకు వేసిన తాళాలను తొలగించి గుర్తుతెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించారు. ప్రిన్స్ మెడికల్ ఏజెన్సీలో రూ.1.20లక్షలు, ప్రిన్స్ మెడికల్ హాల్‌లో రూ.1.50లక్షలు, గ్రీన్ బకెట్ బిర్యానీ సెంటర్‌లో రూ.30వేల నగదు చోరీ చేశారు. అంతేకాకుండా దొంగలను గుర్తించకుండా మూడు షాపుల్లో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆయా షాపుల యాజమానులు వచ్చి చేసేసరికి షట్టర్లు యాథావిధిగా ఉన్నప్పటికీ తాళాలు తీసి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా వస్తువులు అన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. నగదు, హార్డ్‌డిస్క్‌లు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లడంతో ఖాళీగా ఉన్న బాక్స్

పురుగుమందు తాగి యువతి ఆత్మహత్యాయత్నం

పెద్దవూర: నిత్యం ఇంట్లో జరుగుతున్న ఆస్తి తగాదాలతో మనస్తాపానికి గురైన యువతి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం పెద్దవూర మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దవూర మండలంలోని పాత జయరాంతండాకు చెందిన కేతావత్ పాండుకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య కీరికి ఇద్దరు కుమార్తెలు. వీరిద్దరికి వివాహమయ్యింది. 22 ఏళ్ల క్రితం పాండు రెండో వివాహం చేసుకున్నాడు. చిన్న భార్య రాజీకి ఒక కుమార్తె సంధ్య(18), ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద భార్య కీరికి పాండు రెండెకరాల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో గత రెండేళ్లుగా ఇద్దరి భార్యల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పాండు సైతం పెద్ద భార్య వద్దనే ఉంటూ చిన్న భార్యకు దూరంగా ఉంటున్నాడు. దీనిపై చాలాసార్లు పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టించారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో చిన్న భార్య రాజీ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. రాజీ కుమార్తె సంధ్య ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటుంది. నిత్యం ఇంట్లో ఆస్తి తగాదాలు జరుగుతుండటం, తండ్రి తమను పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సంధ్య గురువారం తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల పొలాల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు 108 వాహనంలో నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో బిందె తీర్థం తీసుకొచ్చి గర్భాలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామివార్లను నూతన పట్టువస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించారు. నిత్య కల్యాణాన్ని ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదంతో ప్రారంభించి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాల మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు ఉన్నారు.

మోదీ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

దురాజ్‌పల్లి: ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా 12 కోట్ల మంది రైతులకు ఏడాదికి రూ.6000 ఇస్తున్నట్లు చెప్పారు. బీజేపీ జిల్లా కోశాధికారి పగిళ్ల సుసిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

- ఎంజీయూలో అమరులకు నివాళి


తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీలో గురువారం అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు రవి, ప్రశాంతి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్, రేఖ, ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, కిరణ్, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు. - నల్లగొండ రూరల్

అమరుల త్యాగంతోనే తెలంగాణ సాధన


దోసపహాడ్‌లో కొండేటి వేణుగోపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య

పెన్‌పహాడ్: అమరవీరుల త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్‌లో తెలంగాణ అమరుడు కొండేటి వేణుగోపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేణుగోపాల్‌రెడ్డి తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎంపీ లింగయ్య యాదవ్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, సర్పంచ్ దొంగరి సుధాకర్, మామిడి అంజయ్య, ఉప సర్పంచ్ రాంబాబు, గుడిపూరి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, జగన్, పొదిల నాగార్జున, దంతాల వెంకన్న, మధు, సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్రిక్తంగా మారిన కాంగ్రెస్ పార్టీ నిరసన

- చౌటుప్పల్‌లో హైవేపై రాస్తారోకో చేసేందుకు నాయకుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు

చౌటుప్పల్: టీపీసీసీ పిలుపు మేరకు గురువారం చౌటుప్పల్ పట్టణంలో చేపట్టిన 'దశాబ్ది దగా–తెలంగాణ రావణ వధ' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య తోపులాటకు దారి తీసింది. పట్టణంలోని బస్టాండ్ ముందు జాతీయ రహదారిపై రాస్తారోకో చేసేందుకు పీసీసీ అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక రాజీవ్‌స్మారక భవనం నుంచి బయల్దేరారు. రహదారిపై బైఠాయించే క్రమంలో అప్పటికే పెద్దఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులు, పోలీసుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్ పార్టీ శ్రేణులతో కలిసి ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా అందుకు సైతం పోలీసులు అంగీకరించలేదు. ఈ క్రమంలో మరోసారి కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులను ప్రతిఘటించారు. దీంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని చౌటుప్పల్‌తో పాటు రామన్నపేట, పోచంపల్లి, వలిగొండ, నారాయణపురం పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.


రాస్తారోకో చేసేందుకు వస్తున్న పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్, నాయకులు


పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్, నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అరాచక పాలనకు అంతం తప్పదు..

పోలీసుల అండతో రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి త్వరలోనే అంతం తప్పదని పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దశాబ్ది వేడుకలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కును బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలరాస్తోందని ధ్వజమెత్తారు. ఆరు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రవీందర్, నల్ల నరేందర్‌రెడ్డి, షేక్ జానీబాబు, లందగిరి భీమయ్య, మల్కాపురం నర్సింహ, చెరుకు లింగస్వామి, జగన్‌రెడ్డి, అశోక్, సైదులు, ఆవుల ఏసుదాసు, రఫీక్, గోవర్ధన్‌రెడ్డి, పార శ్యాం, గౌస్‌ఖాన్, కె. లింగస్వామి, తదితరులు ఉన్నారు.